ప్రజాశక్తి

ఆదివారం 24 నవంబర్ 2024 | 5 | విజయనగరం

ఫీజుల కోసం ఒత్తిడిచేస్తే చర్యలు

ప్రయివేటు కళాశాలలకు కలెక్టర్ హెచ్చరిక

విజయనగరంటౌన్ : ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు హాల్ టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు హాజరుకాకుండా అడ్డుకోవడం, ప్రాక్టికల్స్ కు నిరాకరించడం వంటి చర్యలకు పాల్పడే ప్రైవేటు కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్‌లు, యాజమాన్య ప్రతినిధులతో కలెక్టర్ శనివారం తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకువచ్చే చర్యలు చేపడితే సహించబోమన్నారు. ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా కళాశాలల బ్యాంకు ఖాతాలకే జమ చేస్తుందని, ఇప్పటికే వెల్లడించిన విషయాన్ని కలెక్టర్ గుర్తుచేస్తూ విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగించే చర్యలు చేపట్టవద్దని స్పష్టంచేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డిఆర్ఒ ఎస్.శ్రీనివాస మూర్తి, డిగ్రీ, ఇంటర్ కు సంబంధించిన ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్‌లు, జిల్లా సమన్వయ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

అదానీని అరెస్టు చేయాలి

పలుచోట్ల సిపిఎం నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సౌర విద్యుత్ కొనుగోలులో కోట్లాది రూపాయాలను ఆయా రాష్ట్ర అధికారులకు లంచాలు ముట్టచెప్పి నట్లు అమెరికా కోర్టులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్ అధినేత గౌతం అదానీని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన పలుచోట్ల నిరసనలు తెలిపారు. కోట వద్ద జరిగిన నిరసనను ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ అంతర్జాతీయంగా అవినీతికి పాల్పడిన ఆదానీని అరెస్టు చేయకుండా రెండు వారాల తరువాత దర్యాప్తు చేస్తామని కేంద్రం చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. తక్షణమే అదానీతో రాష్ట్రంలో చేసుకున్న ఒప్పందాలన్ని రద్దు చేయాలని, అవినీతికి పాల్పడిన వారిపై కేసులు పెట్టి అరెస్టు చెయ్యాలని, తక్కువ ధరకు విద్యుత్ నీ ప్రజలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదానీ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండు చేశారు. రాష్ట్రం లో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ,కేంద్రంలో మోడీ ప్రభుత్వం అదానీకి అండగా ఉన్నాయని రాష్ట్రంలో టిడిపి, వైసిపి, జనసేన అదానీ అరెస్టుకు డిమాండ్ చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ హరీష్, రంభ శ్రీను, డి.వెంకట రావు పాల్గొన్నారు.

బొబ్బిలి : ప్రధాని మోడీ అండతోనే గౌతమ్ అదాని అవినీతి, మోసాలకు పాల్పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు వెల్లడించారు. అదానీని అరెస్టు చేయాలని శనివారం పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాయతీ గురించి మాట్లాడే సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్.. అదానీ అరెస్టుకు ఎందుకు డిమాండ్ చేయలేదని ప్రశ్నించారు. అదానీతో కుదుర్చుకున్న విద్యుత్తు కాంట్రాక్టు ఒప్పందాల్లో అవినీతికి పాల్పడిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం.. ప్రజలపై దారుణంగా భారాలు మోపిందని విమర్శించారు. అవినీతికి పాల్పడిన వైసిపి నాయకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.యుగంధర్, జి.గౌరీ, శంకర్రావు, వాసు నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్మికులు

దత్తిరాజేరు : గౌతం అదానీని తక్షణమే అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మానాపురం సంత తోట వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన రాష్ట్రంతో సెకీ చేసిన ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం అదానీకి కొమ్ము కాయకుండా అరెస్టు చేయించి దేశం పరువు కాపాడాలని డిమాండ్ చేశారు. గత జగన్ ప్రభుత్వం అదానీ కంపెనీకి 11 వేల ఎకరాల భూమి అప్పగించిందని తెలిపారు. స్మార్ట్ మీటర్లు, డేటా సెంటర్లు, పంపు స్టోరేజ్ విద్యుత్తు సంస్థలు, గంగవరం పోర్టు ఒప్పందాలు చేసుకుందని, కూటమి ప్రభుత్వం ఆ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ అంశంపై నిలదీసిన సందర్భాలు ఉన్నాయి కానీ ఇప్పుడు గట్టిగా నిలబడటం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎల్.దాలినాయుడు, ఈశ్వరరావు, రాంబాబు, బంగారయ్య, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలోని కోట జంక్షన్, దత్తిరాజేరు మండలం మానాపురం సంతతోట వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్మికులు

డిఎస్‌సి మరింత జాప్యం!

- అయోమయంలో అభ్యర్థులు
- వయోపరిమితి పెంచాలంటున్న ఆశావహులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించాల్సిన డిఎస్‌సి పరీక్ష మరింత ఆలస్యం కానుండటంతో అభ్యర్థుల్లో నిరాశ మొదలైంది. నవంబర్ 6న నోటిఫికేషన్ ఇస్తామన్న ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నాటికి పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని తాజాగా ప్రకటించిన విషయం విధితమే. దీంతో ఇప్పటి వరకూ కోచింగ్ కేంద్రాలకు వెళ్లి పరీక్షకు సిద్ధమైన అభ్యర్థులు అయోమయంలో పడ్డారు. విద్యల నగరమైన విజయనగరంలో వేలాది మంది అభ్యర్థులు ఉపాధ్యాయ డిఎస్‌సి కోసం సిద్ధమవుతున్నారు. ఆరేళ్ల తర్వాత నోటిఫికేషన్ విడుదల కానుండడంతో అభ్యర్థులంతా కఠోర దీక్షగా చదువుతున్నారు. 2018లో వచ్చిన నోటిఫికేషన్ తర్వాత ఇంత వరకూ నోటిఫికేషన్ విడుదల కాలేదు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో 16,347 పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించింది. వాటిలో ఉమ్మడి జిల్లాలో దాదాపు 583 పోస్టులు ఉంటాయని అంచనా. అయితే ఏయే సబ్జెక్టుకు ఎన్ని పోస్టులు ఉంటాయనేది ఇంకా వెల్లడించలేదు. నూతన ప్రభుత్వం తన మొదటి మూడు నెలల్లోనే డిఎస్‌సి భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తుందని అందరూ ఆశించినా టెట్ నిర్వహణతో డిఎస్‌సి నోటిఫికేషన్ ఆలస్యమైంది. ఇటీవల టెట్ ఫలితాలు విడుదల కావడంతో అర్హత సాధించిన వారంతా నవంబర్‌లో డిఎస్‌సి నోటిఫికేషన్ వస్తుందని ఎంతో ఆశగా ఉన్నారు. కానీ ప్రభుత్వం మరోసారి వాయిదా వేయటంతో అభ్యర్థులకు బ్రేకులు పడ్డాయి. సుదీర్ఘ విరామం తర్వాత ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపట్టడంతో అనేక మంది ఆశావహులు తాము చేస్తున్న ఉద్యోగాలు మానేసి పరీక్షకు సిద్ధమవుతున్నారు.

విజయనగరంతోపాటు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని శిక్షణా కేంద్రాలకు వెళ్లి ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. అనేక మంది పోస్టులు ఎక్కువగా ఉంటాయని, వయో పరిమితి దాటే వారు ఇదే చివరి అవకాశమని వారు చేస్తున్న ఉద్యోగాలు మానేసి పరీక్షకు సిద్ధమవుతున్నారు. అటువంటి వారంతా అయోమయంలో పడ్డారు. నోటిఫికేషన్ దాదాపు 8 నెలలు వాయిదా పడడంతో తిరిగి ఉద్యోగాల్లోకి వెళ్లాలా లేక, శిక్షణ కొనసాగించాలా అని ఆలోచనలో పడ్డారు. ఎక్కువ మంది చిన్నా చితకా ఉద్యోగాలు చేసుకుంటున్న వారే ఉన్నారు. ఇప్పుడు వాటిని కూడా. వదిలేసి పరీక్షకు సిద్ధమయ్యారు.

డిఎస్‌సి కోసం డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన తెలుపుతున్న అభ్యర్థులు (ఫైల్)

కొంత మంది అప్పులు చేసి కోచింగ్ కేంద్రాల్లో శిక్షణ తీసుకుంటున్నారు. తీరా పరీక్ష వాయిదా పడటంతో ఏమీచేయాలో వారికి పాలుపోవట్లేదు. సుదీర్ఘ కాలం శిక్షణ కొనసాగించటానికి ఆర్థిక పరిస్థితులు సహకరించని వారు ఆందోళన చెందుతున్నారు.

న్యాయపరమైన సమస్యలు రాకుండా పరిశీలించి నోటిఫికేషన్ ఇస్తామని ప్రభుత్వం చెబుతుంది. గతంలో ప్రతి నోటిఫికేషన్ అయినా కోర్టు కేసులు వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో వచ్చే ఏడాది జూన్ నాటికైనా సమస్యలన్నీ పరిష్కారమై సకాలంలో నోటిఫికేషన్ విడుదల అవుతుందో? లేదో? అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పరీక్షకు వయోపరిమితి పెద్ద సమస్యగా మారింది. ప్రతి సంవత్సరం నోటిఫికేషన్లు విడుదల కాకపోవంతో అభ్యర్థులు నిర్దేశిత వయోపరిమితి దాటి అనర్హులవుతున్నారు. ఎంత కష్టపడి చదివినా వయో పరిమితి కారణంగా పరీక్షకు అర్హత కోల్పోతున్నారు. ఆరేళ్లపాటు నోటిఫికేషన్ లేనందున కొందరు అభ్యర్థులు వయోపరిమితి పెంచి న్యాయం చేయాలని కోరుతున్నారు. సమస్యలను వేగంగా పరిష్కరించి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతున్నారు.

డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఏడాది కాలంగా డిఎస్‌సి కోసం నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. వేల రూపాయలు కట్టుకొని కోచింగ్ సెంటర్లలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు రూములు అద్దెలు కూడా భారంగా మారాయి. వెంటనే ప్రభుత్వం డిఎస్‌సి నోటిఫికేషన్ వెంటనే విడుదల చేసి, పరీక్ష నిర్వహించాలి.

- బి.హరీష్, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్

నేడు యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యుటిఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని యు టి ఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమేష్‌చంద్రపట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, గౌరవాధ్యక్షులు ఎ.అప్పలనాయుడు కోరారు. శనివారం స్థానిక ఎన్ పి అర్ భవనంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ యుటిఎఫ్ మహాసభ ఆదివారం ఉదయం 9గంటలకు కెఎల్‌పురంలోని శేషగిరి విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని, ముందుగా కలెక్టరేట్ వద్ద మహాత్మా పూలే విగ్రహం నుంచి వేదిక వరకు ర్యాలీ జరుగుతుందని తెలిపారు. అనంతరం విద్యారంగ పరిణామాలు ప్రభుత్వం ఉపాధ్యాయుల సమాజం పాత్ర పై చర్చించనున్నామని, సాంస్కృతిక కార్యక్రమాలు జిల్లా స్థాయి ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం ఉంటాయని తెలిపారు. ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు, ఉద్యోగ ఉపాధ్యాయ జెఎసి చైర్మన్ ఎవి నాగేశ్వరరావు హాజరవుతారని తెలిపారు.జిల్లావ్యాప్తంగా 29మండల శాఖల నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్ భాస్కర రావు, సహాధ్యక్షులు వి. ప్రసన్నకుమార్, జి. పార్వతి, కార్యదర్శులు కె.ప్రసాద రావు, సిహెచ్ తిరుపతినాయుడు, జి.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

కొండవెలగాడ 22ఎ భూములపై విచారణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కొండవెలగాడ పరిధిలోని టిడి నెంబరు 441లో సర్వే నెంబర్ 298లో 9.99 ఎకరాల 22ఏ భూములను రెవెన్యూ సిబ్బంది శనివారం పరిశీలించి విచారణ చేపట్టారు. ప్రభుత్వ నిషేధిత జాబితా 22ఏలో ప్రభుత్వ చెరువు, భూమిని 2018లో అప్పటి తహశీల్దార్ వేరొకరి పేరుమీద 1బి, పట్టాదారు పాస్ పుస్తకాలు, టైటిల్ డీడ్ ఇవ్వడంపై గ్రామానికి చెందిన రొంగళి రమణ కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్ఐ, విఆర్ఒ 22ఏ భూమిపై విచారణ జరిపారు. కాగా రెవెన్యూ సిబ్బంది విచారణపై టిడిపి నాయకులు మొయిద సత్య నారాయణ, రొంగలి రమణ మాట్లాడుతూ కొండవెలగాడ రెవెన్యూ పరిధి టిడి నెంబర్ 441లో సర్వే నెంబర్ 298లో 9.99 ఎకరాల వీస్తీర్ణంలోని 22ఏలో ఉన్న చెరువుని అప్పటి తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది ప్రలోభాలకు గురై జిరాయితీ భూమిగా చేర్చి రాజా సాగి మహేష్ కుమార్ రాజా, రాజా సాగి దేవి వెంకట పద్మ నాభ రాజు పేరిట 1బి, పట్టా దారు పాస్ పుస్తకాలు, టైటిల్ డీడ్ సృష్టించి నట్లు తెలిపారు. ఈ చెరువు భూమి అక్రమణకు గురవ్వడంతో వేలాది ఎకరాలు భూమికి సాగు నీరు అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూముల పై పలు మార్లు రెవెన్యూ అధికార్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. కాగా చెరువు గట్టు మీద చెట్లు కూడా తొలగించారని గుర్తు చేశారు. 22ఏలో ఉన్న చెరువు భూమిని తమ పేరిట రాయించుకున్న వారు, అధికార్లపై చర్యలు తీసుకొని చెరువుని పునర్నిర్మాణం చేసి అప్ప జెప్పాలని డిమాండ్ చేశారు.

గ్రామసభల్లో వచ్చిన వినతులకు 3 రోజుల్లో పరిష్కారం

తహశీల్దార్లు, సర్వేయర్లకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో గతంలో భూముల రీసర్వే సందర్భంగా నిర్వహించిన గ్రామసభల్లో భూసమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను మూడు రోజుల్లోగా పరిష్కరించాలని జిల్లాలోని అన్ని మండలాల తహశీల్దార్లను జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకూ భూసర్వేకు సంబంధించి నిర్వహించిన గ్రామసభల సమాచారాన్ని తక్షణమే అందజేయాలని చెప్పారు. జిల్లాలోని తహశీల్దార్‌లు, మండల సర్వేయర్‌లతో కలెక్టర్ శనివారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి గ్రామసభల్లో వచ్చిన వినతుల పరిష్కారంపై సమీక్షించారు. జిల్లాలో గతంలో భూసర్వే నిర్వహించిన గ్రామాల్లో 502 గ్రామసభలు నిర్వహించగా ఇందులో భూ సమస్యలపై 25,222 దరఖాస్తులు అందాయన్నారు. ఇందులో రెవిన్యూ శాఖకు సంబంధించినవి 13,496, సర్వే విభాగానికి చెందినవి 11,726 గా చూపిస్తున్నారని, వీటన్నింటినీ బుధవారంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్‌డిఒలు స్వయంగా ఈ వినతుల పరిష్కారంపై పర్యవేక్షణ చేసి త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, సర్వే భూరికార్డుల విభాగం ఎడి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ఉపాధ్యాయ ఓటర్ల నమోదుకు 9 వరకు గడువు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం ఓటర్ల జాబితా లో క్లెయిమ్స్, అభ్యంతరాలను డిసెంబర్ నెల 9 లోగా సమర్పించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. కొత్తగా ఓటర్ల నమోదు కోసం ఫారం 7 ద్వారా, సవరణల కోసం ఫారం 8 ద్వారా డిసెంబర్ 9 లోగా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. శనివారం కలెక్టర్ తన ఛాంబర్ లో రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డ్రాఫ్ట్ రోల్ ప్రచురణ నవంబర్ 23 న జరుగుతుందని, డిసెంబర్ 9 లోగా క్లెయిమ్స్ , అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. డిసెంబర్ 25 లోగా క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం ఉంటుందని, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతుందని తెలిపారు. జిల్లాలో నవంబర్ 23 నాటికి 3425 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 2164 మంది , స్త్రీలు 1261 మంది ఉన్నారని తెలిపారు. ప్రతి మండలంలో ఒక పోలింగ్ కేంద్రం చొప్పున ఉంటుందని, విజయనగరానికి సంబంధించి 3 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కర్ రావు , పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొరియర్ పేరుతో వచ్చే కాల్స్ పట్ల అప్రమత్తం

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

కొరియర్ పేరుతో వచ్చే కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంక్ వివరాలు, ఒటిపి, వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పవద్దని ఎస్‌పి వకుల్ జిందాల్ సూచించారు. సైబల్ నేరాల్లో ఎవరైనా నగదును పోగొట్టు కొన్నట్లయితే 1930 కు లేదా నేషనల్ సైబరు క్రైంపోర్టల్ https://cyber-crime.gov.in రిపోర్టు చేయాలని సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూకొరియర్ పేరుతో సైబరు మోసగాళ్ళు ప్రజలకు ఫోన్ కాల్స్, వీడియో కాల్స్ చేసి, మోసాలకు పాల్పడుతున్నారని, ఇటువంటి వారి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపు నిచ్చారు. సైబరు మోసగాళ్ళ పంపిన లింకును క్లిక్చేస్తే, తమ బ్యాంకు సేవింగు ఖాతాల్లోని నగదు చోరీకి గురవుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐ ఎ.వి. లీలారావు, టిఆర్ చౌదరి, విజయనగరం 2వ పట్టణ సిఐ టి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

కలెక్టర్‌కు ఎపి రైతు సంఘం లేఖ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో వరి పంట కోత దశ లో కత్తెర పురుగు, కొమ్ము పురుగు వల్ల వరి పంటకు నష్టం వాటిల్లిందని, అటువంటి రైతులను సంబంధిత అధికారులు గుర్తించి పరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.గోపాలం, బి.రాంబాబు, ఉపాధ్యక్షులు ఎల్ ఆదినారాయణ కోరారు. ఈ మేరకు ఎపి రైతుసంఘం నాయకులు కలెక్టర్‌కు లేఖ రాశారు. జిల్లాలో రైతులు గణనీయంగా సుమారు 30శాతం నుండి 80శాతం వరకు నష్టపోయారని తెలిపారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

రోడ్డుపై పశువులను నిలిపి రాస్తారోకో చేస్తున్న పాల రైతులు

రహదారి దిగ్బంధం

పశువులతో సహా రోడ్డెక్కిన పాడి రైతులు

ప్రజాశక్తి-కొత్తవలస

విశాఖ డెయిరీ తగ్గించిన పాల సేకరణ ధర పెంచాలని కోరుతూ వినూత్న రీతిలో పశువులతో సహా పాలరైతులు రోడ్డెక్కారు. మండలంలోని నిమ్మలపాలెం జంక్షన్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పాల రైతుల సంఘం జిల్లా కార్యదర్శి గొంప రామకృష్ణ మాట్లాడుతూ విశాఖ డెయిరీ యాజమాన్యం పాడి రైతులకు నష్టం కలిగించేలా పాల ధరలను రూ.3 నుంచి రూ.5 వరకు తగ్గించిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటి వరకు పాడి రైతులను ఆదుకుంటామని చెబుతూ వచ్చిన విశాఖ డెయిరీ యాజమాన్యం.. రైతుల డబ్బులు వెచ్చించి పశువులను కొనుగోలు చేయించిందని చెప్పారు. యాజమాన్యం వ్యాపార స్వలాభం కోసం నేడు పాల ధరలను తగ్గించి పాడి రైతును రోడ్డును పడేసే పరిస్థితులు తెచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బహిరంగ మార్కెట్లో విశాఖ డెయిరీ పాల ధరలు ఎక్కడా తగ్గలేదని, అలాంటప్పుడు పాడి రైతులకు ఎందుకు ధరలు తగ్గించారో చెప్పాలని డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీ యాజమాన్య అవినీతిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

హైస్కూల్ పనివేళల మార్పు సరికాదు

విద్యాశాఖ ఎడికి ఉపాధ్యాయ సంఘాలు వినతి

విజయనగరం టౌన్ : రాష్ట్ర విద్యాశాఖ ఉన్నత పాఠశాలల పని వేళలో మార్పు విషయంలో ప్రయోగాలు చేయడం సరికాదని జిల్లా ఉపాధ్యాయ సంఘాల నాయకులు అన్నారు. శనివారం విద్యాశాఖ ఎడి శ్రీనివాసరావుకు వినతి అందజేశారు.ఈ సందర్భంగా రెసిడెన్షియల్ ట్రైనింగ్ ప్రోగ్రాంను రద్దుచేసి ఆన్‌లైన్ ట్రైనింగ్ విధానంలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ముఖ్యంగా దూర ప్రాంతంలో ఉపాధ్యాయులు రెసిడెన్షియల్ శిక్షణ వల్ల ఇబ్బందులు పడతారని, వాటిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర విద్యాశాఖ పునరాలోచించాలని కోరారు. వినతినిచ్చిన వారిలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్ కె ఈశ్వరరావు, ఎస్‌టియు నాయకులు డి.శ్యామ్, ఆపస్ నాయకులు రామునాయుడు, కిరణ్ కుమార్, ఎటిఎ నాయకులు అమర్ నాథ్ పాల్గొన్నారు.

సౌరవిద్యుత్తు కొనుగోళ్లలో అదానీ అవినీతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

సౌర విద్యుత్ కొనుగోలులో అవినీతికి పాల్పడిన అదానీ గ్రూప్ అధినేత గౌతం అదానీని అరెస్టు చేయాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు లక్కరాజు రామారావు, జాతీయ యూత్ కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు, రాష్ట్ర ఇన్‌ఛార్జి మమత నాగిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన యువజన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా, మండల స్థాయిలో యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తామని తెలిపారు.

జిల్లాలో ప్రతి మండల జిల్లా స్థాయిలో యువజన కాంగ్రెస్ బలోపేతంలో భాగంగా శక్తి అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్, యువతకు ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాల హామీలను మోడీ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మానవ వనరులశాఖా మంత్రి లోకేష్ నారా లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం 20లక్షలు ఇస్తే యువత మత్తుకు బానిసలు కాకుండా ఉంటారని అన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వంలో విశాఖ పోర్టులో ఒక కంటైనర్ ద్వారా వందల కేజీల గంజాయి ఏ విధంగా విశాఖపట్నం వచ్చిందో ఇప్పటికీ ఈ కేంద్ర ప్రభుత్వం తేల్చలేదన్నారు. దేశంలోకి ఇతర ప్రాంతాల నుంచి మత్తు పదార్థాలు వచ్చి చేరుతున్నాయని, వీటి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎం. విద్యాసాగర్, పట్టణ మాజీ అధ్యక్షులు సుంకర సతీష్, ఎస్. శ్రీనివాస్, నియోజకవర్గాల ఇన్చార్జులు, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

అదానీని అరెస్టు చేయాలని పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అడుగు తీసి అడుగేస్తే టోల్ దరువు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'బాబోయ్... ఇదెక్కడి న్యాయం... అడుగుతీసి అడుగు వేస్తే టోల్ గేట్ రూపంలో దరువు వేస్తారట. ఇలాగైతే... ఇక ఊరు దాటి ఊరు వెళ్లే జేబులు చిల్లే. కూర్చుంటే పన్ను, నిలబడితే పన్ను అన్న చందంగా ఉంది బాబుగారి ప్రభుత్వం తీరు' అంటూ జనం విస్తుపోతున్నారు. 'త్వరలో రాష్ట్ర, జిల్లా, గ్రామీణ రహదారులకు కూడా టోల్‌గేట్ ఛార్జీలు విధిస్తాం. ప్రజల నుంచి వ్యతిరేకత లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలదే, లేదంటే గతకల రోడ్లే ఉంటాయి' అంటూ సాక్షాత్తు సిఎం చంద్రబాబు నాయుడే శాసన సభలో ఈనెల 19న ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మాటలకు జిల్లా వాసుల్లో ఉలికిపాటు మొదలైంది. ఇప్పటికే జిల్లాలోని జాతీయ రహదారులపై నలుదిక్కులా టోల్‌గేట్లు ఉన్నాయి. ముఖ్యంగా జొన్నాడ టోల్‌గేట్‌తో విశాఖ వెళ్లి, వచ్చే ప్రయాణికులపై తీవ్ర భారం పడుతోంది. ఇది చాలదన్నట్టు మానాపురంలో మరొకటి రెడీ చేస్తున్నారు. అటు నాతవలస, ఇటు గంట్యాడ వైపు కూడా టోల్‌గేట్ పెట్టేశారు. ఇప్పటికే ఆర్థిక భారం భరించలేని పరిస్థితి ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో ఏకంగా రాష్ట్ర, జిల్లా స్థాయి రహదారులపై కూడా టోల్ ఛార్జీలు విధించేందుకు సిద్ధపడడంతో జనం ఒకింత ఆందోళనతోనూ, ప్రభుత్వంపై ఆగ్రహంతోనూ ఉన్నారు. మన జిల్లాలో 122 కిలోమీటర్ల రాష్ట్ర రహదారి, మరో 292 కిలోమీటర్ల మేర జిల్లా రహదారులు విస్తరించి ఉన్నాయి. వీటిపై టోల్‌గేట్ల ఫీజులు వసూలు చేపట్టడం మొదలెడితే



ప్రజలు ప్రయాణం మానుకోవాల్సి తప్ప, తప్పించుకునేందుకు అవకాశం లేదని జనం చర్చించుకుంటున్నారు. ఈ సంగతి కాస్త అటుంచితే, టోల్ గేట్లను అంగీకరించని చోట గతుకుల రోడ్లే ఉంటాయన్న చంద్రబాబు హెచ్చరికలు మరింత ఇబ్బందికరంగా ఉన్నాయన్న చర్చకూడా సాగుతోంది. డబ్బులు ఇచ్చినవారికే రహదారుల సదుపాయం కల్పిస్తామన్నట్టుగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఈ మాత్రం దానికేనా గతుకుల రోడ్ల మరమ్మతు పనుల ప్రారంభానికి మన జిల్లాలో రూ.కోట్ల ఖర్చుచేశారా? అంటూ కొందరు ముక్కున వేళ్లేసుకుంటున్నారు. అసలే పేదలు, వలసకూలీలు, చిన్నసన్నకారు రైతులు ఎక్కువ మంది ఉన్న జిల్లా మనది. తలసరి ఆదాయంలో అట్టడుగు స్థానం. అరకొర ఆదాయం స్కూళ్లు, కాలేజీల ఫీజులు, ఆసుపత్రి ఖర్చులకే సరిపోని పరిస్థితి ఎక్కువ కుటుంబాల్లో ఉంది. దీనికితోడు విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్స్ ఇప్పటికీ ఇవ్వలేదు. ఇచ్చినా పెరిగిన పుస్తకాల ధరలు, ఇతర ఫీజులకు ఎటూ సరిపోని పరిస్థితి ఉంది. తల్లికి వందనం సహా సూపర్ -6లో ప్రకటించిన పథకాల అమలుపై శ్రద్ధ చూపలేదు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర, జిల్లా స్థాయి రోడ్లపై కూడా మునుపెన్నడూ లేనంతగా టోల్ ఫీజులకు సిద్ధపడడం ఎంత వరకు సమంజసం అంటూ జనం చర్చించుకుంటున్నారు. ఇలా చిన్న రహదారులపై కూడా ఇరకమైన ఛార్జీల మోత మొదలెడితే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించకోక తప్పదంటూ పబ్లిక్ టాక్ వినిపిస్తోంది.

పైడితల్లమ్మ ఆలయ ఎసిగా ప్రసాద్

విజయనగరం టౌన్ : పైడితల్లి అమ్మవారి దేవస్థానం సహాయ కమిషనర్‌గా కెడివిడి ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. మాన్సాస్ ఉప కమిషనర్‌గా ఉన్న ఆయన పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత పైడితల్లి అమ్మవారి సహాయ కమిషనర్ డివివి ప్రసాదరావు సెలవుపై వెళ్లడంతో ప్రసాద్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.



ఎసిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రసాద్

జెఎన్‌టియును సందర్శించిన సెంచూరియన్ విసి

విజయనగరంటౌన్ : సెంచూరియన్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జిఎస్ఎన్ రాజు, ఎయు మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్.ఎం.శశి విద్యాసంబంధమైన కార్యక్రమంలో భాగంగా శనివారం జెఎన్‌టియు-జివిని సందర్శించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వారికి ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జి.జయసుమ తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమంలో వారు పాల్గొని విశ్వవిద్యాలయం సుందరంగా తీర్చి దిద్దడంలో గ్రీన్ క్లబ్ చొరవను అభినందించారు.

ప్రభుత్వ కళాశాలకు పతకాల పంట

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఆంధ్ర విద్యాలయంలో జరిగిన అంతర కళాశాల ఆటల పోటీల్లో నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పలు పతకాలు లభించాయి. కళాశాల పీడీ డాక్టర్ పి. జయలక్ష్మి ఆధ్వర్యాన విద్యార్థులు నాలుగు స్వర్ణం, నాలుగు కాంస్యం, ఒక రజిత పతకం గెలుచుకున్నారు. పి.వసంతకు 100 మీటర్లు, 200 మీటర్లలో బంగారు పతకాలు, డి.నీలిమకు లాంగ్ జంప్‌లో బంగారు పతకం, ట్రిపుల్ జంప్‌లో బంగారు పతకం సాధించారు. 800 మీటర్ల పరుగు పోటీలో పి.లక్ష్మణరావుకు సిల్వర్, ఎ. సురేంద్రకు 100 మీటర్ల హెండిల్స్ లో సిల్వర్, ఎం.శిరీషకు 5వేల మీటర్లలో సిల్వర్, 1500 మీటర్లలో సిల్వర్ పతకం లభించాయి. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రేఖ, పీడీ జయలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.

సత్తాచాటిన 'ప్రగతి' విద్యార్థులు

ప్రజాశక్తి-కొత్తవలస

ఆంధ్రా యూనివర్సిటీ అంతర్ కళాశాల అథ్లెటిక్స్ పోటీల్లో కొత్తవలసలోని ప్రగతి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులు పతకాల పంట పండించారు. మూడు బంగారు, ఐదు రజత, నాలుగు కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ వి.రమాదేవి, సెక్రటరీ, కరస్పాండెంట్ వి.శ్రీనివాసరావు, డైరెక్టర్ కె.కోటేశ్వరరావు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్‌బాబు అభినందించారు.

వాహన తనిఖీలు

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలో మోటారు వాహన చట్టం నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఎస్ఐ ఎస్.సుదర్శన్ శనివారం నిమ్మలపాలెం మలుపు వద్ద ద్విచక్ర వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ ధరించక పోవడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, సరైన రికార్డులు చూపించకపోవడంతో కొన్ని వాహనాలకు అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి- రాజాం

మండలంలో కొత్త రేషన్ కార్డులపై ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. రేషన్ కార్డు లేని పేదలకు కొత్తగా రేషన్ కార్డులు అందించేందుకు చర్యలు చేపట్టింది. డిసెంబర్ 2 నుంచి 28వ తేదీ వరకు మండలంలో అన్ని గ్రామాల ప్రజలు స్థానిక సచివాలయాలలో దరఖాస్తులు స్వీకరిస్తామని తహశీల్దార్ కృష్ణంరాజు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తులు చేసుకున్న కార్డులు రానివారు, ఏదాది జనవరి ఒకటో తేదీ నుంచి మార్చి వరకు చేసుకున్న దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకొని అన్నింటిని పరిశీలించి అర్హులకు రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. సంక్రాంతి కానుకగా మంజూరు చేస్తామని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు లక్ష్యాలను చేరుకోవాలి

నెల్లిమర్ల : విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలు చేరుకోవాలని ఎస్ఐ. బి.గణేష్ అన్నారు. శనివారం ఆయన అలుగోలు జెడిపి ఉన్నత పాఠశాల విద్యార్థులకు భవిష్యత్ లక్ష్యాలు, కెరీర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గణేష్ మాట్లాడుతూ విద్యార్థులు విద్య ద్వారా భవిష్యత్ లక్ష్యాలు చేరుకోవాలని, వృత్తి పరమైన నైపుణ్యం సంపాదించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు పరిశీలన

విజయనగరం టౌన్ : నగర వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. పలు పోలింగ్ కేంద్రాలను నగర కమిషనర్ పి.నల్లనయ్య పరిశీలించారు. బూత్ లెవెల్ అధికారికి, ఇతర సిబ్బందికి ఓటరు నమోదు ప్రక్రియ పై తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఒక నియోజకవర్గం నుండి మరొక నియోజకవర్గానికి పేరు మార్పు చేసుకోటానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముమ్మరంగా వ్యాధి నిరోధక టీకాలు

విజయనగరం టౌన్ : నగరంలోని అన్ని సచివాలయాల పరిధిలో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఎఎన్ఎంలు, హెల్త్ సెక్రటరీలు అన్ని గృహాలకూ వెళ్లి చిన్నపిల్లల వివరాలను నమోదు చేసుకుని, క్రమం తప్పకుండా వారందరికీ వ్యాక్సినేషన్లు, వ్యాధి నిరోధక టీకాలను వేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రజారోగ్యమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. పిల్లల ఆరోగ్య భద్రతను కాపాడుకునేందుకు ప్రతి తల్లి తప్పనిసరిగా టీకాలను వేయించాలని చెప్పారు.

రెల్లరాల్చు పురుగు నివారణపై అవగాహన

శృంగవరపుకోట : రెల్లరాల్చు పురుగు నివారణపై వివిఎం రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ ఎడి ఎల్.విజయ ఆదేశించారు. శనివారం పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో వివిఎలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలకు ఏదైనా తెగులు సోకితే, వాటిని ఫోటో తీసి ఎన్‌పిఎస్ఎస్ యాప్‌లో పెడితే నివారణ చర్యలు తెలియజేస్తుందని చెప్పారు. విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ కె.భారతి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా ప్రదర్శన

శృంగవరపుకోట : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితాను శనివారం తహశీల్దార్ అరుణకుమారి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఫారం-7, 8, ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం -19 ద్వారా డిసెంబర్ 9వ తేదీలోగా తెలియజేయాలని సూచించారు.

మారికలో వైద్య శిబిరం

వేపాడ : మండలంలోని గిరిజన గ్రామం మారికలో వేపాడ పిహెచ్‌సి ఆధ్వర్యాన వైద్య శిబిరంలో నిర్వహించారు. ఈ శిబిరంలో 92 మందికి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.ఎర్రయ్యమ్మ, పిహెచ్‌సి హెల్త్ సూపర్‌వైజర్ వి.వెంకటరమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి- డెంకాడ

శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో "భగవంతుడే నా నిజమైన స్నేహితుడు" అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీలో రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దిండి అనుదీప్తి జోన్ విభాగంలో ప్రథమ స్థానం సాధించింది. మండల స్థాయిలో ఇంగ్లీష్ విభాగంలో బి. ప్రశాంతి, కె. సౌమ్య గాయత్రి, పి. భవ్య శ్రీ వరుస స్థానాలు సాధించారు. తెలుగు విభాగంలో పి. వైష్ణవి, కలిశెట్టి రమ్య, ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. వీరికి శ్రీ సత్య సాయి సేవా సమితి డెంకాడ ఆధ్వర్యంలో బహుమతి ప్రధానోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, పిఎస్‌సిఎస్ మాజీ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, ప్రదీప్ రాజు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

పినతాడివాడలో సాయిబాబా పుట్టినరోజు సందర్భంగా 30 మంది పేదలకు దుప్పట్లు, చీరలు, సాయిబాబా భక్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లంక లక్ష్మణ రావు, మాజీ ఎంపిటిసి కోరనాన ఆదిబాబు, గేదెల అర్జున, సాయిబాబా భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ కాంగ్రెస్

విజయనగరం టౌన్ : పర్యావరణ సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శన శనివారం మున్సిపల్ కంటోన్మెంట్ ఉన్నత పాఠశాలలో విజయవంతంగా జరిగింది. ఈ ప్రదర్శనను డిఇఒ మాణిక్యం నాయుడు ప్రారంభించారు. జిల్లాలో వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు విచ్చేసి 'చెత్త నుంచి సంపద' అనే కాన్సెప్ట్‌పై అనేక రకాలైన వస్తువులు తయారు చేసి ప్రదర్శించారు. 'వాతావరణ కాలుష్యం' అనే విషయం పైన స్పాట్ పెయింటింగ్ కూడా నిర్వహించి విద్యార్థులకు మెమెంటో, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. చెత్త నుండి సంపద ప్రదర్శనలో కొత్తవలస పాఠశాలకు ప్రథమ బహుమతి, మరుపల్లి జెడ్పి హైస్కూలుకు ద్వితీయ, రేగిడి జెడిపి హైస్కూలుకు తృతీయ బహుమతి లభించింది. స్పాట్ పెయింటింగ్‌లో విజయనగరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు ప్రథమ, దత్తిరాజేరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు ద్వితీయ, కొండ గంపాం జెడిపి ఉన్నత పాఠశాలకు తృతీయ బహుమతి లభించాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు, ఎన్జీసీ జిల్లా కోఆర్డినేటర్ వేణుగోపాలరావు, క్లస్టర్ కోఆర్డినేటర్లు వి.సత్యారావు, పి.సత్య ప్రకాష్, బి. సూర్యకళ, వాసుదేవ రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పుట్టినరోజు సందర్భంగా టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో కార్యకర్తలు ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో యువత, కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. నగర పరిధిలోని అన్ని డివిజన్లు, మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి యువత స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు, సునీలా గజపతి, స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా వారికి పండ్లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి రక్తదాత ఒక ప్రాణదాత అని, రక్తం అనేది ప్రతి ఒక్కరికి అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు మూడు నెలలకు లేదా ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తే ఆరోగ్యవంతులుగా తయారవుతారని అన్నారు. మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, ఎంపిటిసి సభ్యులు రాజేష్ బాబు, వేచలపు శ్రీనివాసరావు, నగర నాయకులు అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్, కంది మురళి, విజ్జపు ప్రసాద్ , మహేష్, టిడిపి మహిళా పార్లమెంట్ కార్యదర్శి బేగం, మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల కనకమాలక్ష్మి, రొంగలి రామారావు, మాజీ ఎంపిపి కంది సాయి జగ్గారావు, మలిచర్ల గ్రామం కొసర శివ , బియ్యాల పేట సర్పంచ్ పడగల అబద్ధం, రామకృష్ణ , సుంకర పేట మాజీ సర్పంచ్ రామునాయుడు, సారిక సర్పంచ్ బొబ్బాది ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పినవేమలిలోని ఎబిసిడి వృద్ధాశ్రమంలో ఎమ్మెల్యే అతిది విజయలక్ష్మి గజపతిరాజు వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

రక్తదాతను అభినందిస్తున్న సునీలా గజపతి, టిడిపి నాయకులు

ఆ భూములు కబ్జా చేస్తే చర్యలు

గిరిజనులతో మాట్లాడుతున్న తహశీల్దార్ ఎం.శ్రీను

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

గిరిజనుల భూములు కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఎం.శ్రీను హెచ్చరించారు. మండలంలోని నిమ్మలపాడు, కొయ్యకొండవలస గిరిజనుల భూములపై సాలూరు మండలం బాగువలసకు చెందిన వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడటంతో ఎపి వ్యవసాయ సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయడం, పత్రికల్లో కథనాలు రావడంతో తహశీల్దార్ స్పందించారు. శనివారం నిమ్మలపాడు గిరిజన భూములను పరిశీలించారు. ఆ భూములను చదును చేస్తున్న రెండు ట్రాక్టర్లను విఆర్ఓ అప్పలనాయుడు ద్వారా స్వాధీనం చేసుకున్నారు. గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన భూములను సాగు చేసుకుని జీవనం సాగించాలని, లీజుకివ్వడం, అమ్మకాలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని చెప్పారు. గిరిజనుల నుంచి లీజు, అమ్మకాల పేరుతో స్వాధీనం చేసుకున్న వ్యక్తులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రేపు రాజా కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక రాజా కళాశాలలో సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్ వీరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2021, 2022, 2023, 2024లో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనాలిటికల్, బిఎస్‌సి కెమిస్ట్రీ, బికాం, బిఎ, ఇంటర్మీడియట్, టెన్త్, డిప్లొమోలో కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఐటిఐ ఫిట్టర్ పూర్తి చేసిన పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, బయోడేటాతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. బొబ్బిలి ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విరాళం అందజేస్తున్న టిడిపి నాయకులు గోవిందరావు

కుష్టువ్యాధి గ్రస్తుల పాదరక్షలకు రూ.10 వేలు విరాళం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కుష్టువ్యాధి బాధితులకు ప్రత్యేక పాదరక్షలు నిమిత్తం కొండగుంపాం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పతివాడ గోవిందరావు రూ.10 వేలు విరాళంగా అందజేశారు. శనివారం తన భార్య పతివాడ అన్నపూర్ణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకునని లెప్రా సొసైటీ రిసోర్స్ ఎగ్జిక్యూటివ్ లెంక రమణకు ఈ మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా లెంక రమణ మాట్లాడుతూ జిల్లాలో లెప్రా సొసైటీ జిల్లా ప్రభుత్వ మహారాజ ఆసుపత్రిలో జిల్లా కుష్టు నివారణ అధికారి సహకారంతో బాధితులకు రిఫరెల్ సెంటర్ ద్వారా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా కుష్టువ్యాధి బాధితులకు ఉచితంగా ప్రత్యేక పాదారక్షలు, సెల్ఫ్‌కేర్ కిట్లు, ఫిజియో థెరపీ సేవలు అందించనున్నట్లు తెలిపారు.

ఓటర్ల నమోదులో పారదర్శకత

ప్రజాశక్తి-బొబ్బిలి

ఓటర్ల నమోదులో పారదర్శకత పాటించాలని ఆర్‌డిఒ రామ్మోహనరావు కోరారు. మున్సిపాలిటీలోని గొల్లపల్లి మున్సిపల్ పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటుహక్కు కల్పించేందుకు ప్రత్యేక ఓటర్ల నమోదు చేపడుతున్నట్లు చెప్పారు. మరణించిన వారి ఓట్లను తొలగించాలని సూచించారు. ఓటర్ల నమోదులో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో ఎన్నికల డిటి గౌరీశంకర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న ఆందోళన

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని మేదరబంద జంక్షన్ లో ఏర్పాటు చేసిన మద్యం షాపునకు వ్యతిరేకంగా మహిళలు చేపట్టిన ఆందోళన కొనసాగుతుంది. జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపునకు వ్యతిరేకంగా మూడు వారాలుగా మహిళలు ఆందోళన చేస్తున్నప్పటికీ షాపును తరలించకపోవడంతో షాపు ముందు మహిళలు ఆందోళన కొనసాగిస్తున్నారు. షాపును వేరే ప్రాంతానికి తరలించే వరకు ఆందోళన చేస్తామని మహిళలు చెపుతున్నారు.

వైన్‌షాప్ వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

వేతన ఒప్పందం తక్షణమే అమలు చేయాలి

ప్రజాశక్తి-చీపురుపల్లి

కార్మికులకు చేస్తామన్న వేతన ఒప్పందాన్ని వెంకట్రామా పౌల్ట్రీస్ యాజమాన్యం తక్షణమే అమలు చేయాలని సిఐటియు నాయకులు, కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండలంలోని కర్లాం గ్రామంలో ఉన్న వెంకట్రామా పౌల్ట్రీ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ వెంకట్రామ పౌల్ట్రీస్‌లో పని చేస్తున్న కార్మికులకు యాజమాన్యం వేతన ఒప్పందం జూన్ నెలలో చేయవలసి ఉన్నప్పటికీ నేటి వరకు చేయకుండా మొండిగా వ్యవహరిస్తోందన్నారు. గతంలో విజయనగరం డిప్యూటీ లేబర్ కమిషనర్ దగ్గర యూనియన్‌కి యాజమాన్యానికి జరిగిన చర్చల్లో ఎటువంటి అభివృద్ధి లేదన్నారు. ఈ నేపథ్యంలో వెంకట్రామ పౌల్ట్రీస్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో గేటు ముందు ధర్నా నిర్వహించి తమ నిరసనను యాజమాన్యానికి తెలియజేస్తున్నామన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం కార్మికుల సమస్యలను అర్థం చేసుకొని పరిష్కారం చేయాలని వారు కోరారు. లేని పక్షంలో తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని భవిష్యత్తు పరిణామాలకి యాజమాన్యమే బాధ్యత వహించవలసి ఉంటుందని సిఐటియు నాయకులు, కార్మికులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంబళ్ల గౌరీ నాయుడు వెంకట్రామ పౌల్ట్రీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఐ.గుర్నాయుడు, టి ఈశ్వరరావు, కమిటీ సభ్యులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు గౌరునాయుడు

ధర్నా విజయవంతానికి ప్రచారం

ప్రజాశక్తి-గంట్యాడ

కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్ ఆధ్వర్యాన ప్రచారం చేశారు. శనివారం మండలం లక్కిడాం, బుడతనాపల్లి జంక్షన్‌లో ఉన్న ఆటో కార్మికులతో ఆయన మాట్లాడి, ధర్నాకు తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా, విధానాల్లో మార్పు లేదని వెల్లడైందన్నారు. ఎన్‌డిఎలో భాగస్వామ్యమైన టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం కూడా అవే విధానాలను అమలు చేస్తోందని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో వీటిని తిప్పికొట్టాల్సిన అవసరం కార్మికులు, రైతులపై ఉందని పిలుపునిచ్చారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-శృంగవరపుకోట

యుటిఎఫ్ శృంగవరపుకోట మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. శనివారం పట్టణంలోని ఎంపిపి పాఠశాలలో మండల అధ్యక్షులు ఎంవిఎఎస్ నారాయణ అధ్యక్షతన యుటిఎఫ్ మండల కౌన్సిల్ నిర్వహించారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి జివి రమణ, ఎన్నికల పరిశీలకులుగా జెవివిఆర్‌కె ఈశ్వరరావు వ్యవహరించారు. మండల గౌరవాధ్యక్షులుగా వి.ఇ.సత్యనారాయణ, వి.ఎస్.దేముడు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎంవిఎఎస్ నారాయణ, ఎ.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎ.వి.లక్ష్మి, డి.తిరుపతిరావు, కోశాధికారిగా ఎ.రాము ఎన్నికయ్యారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరిని గెలిపించాలని నాయకులు కోరారు.

1200 కేజీల ప్లాస్టిక్ స్వాధీనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ప్లాస్టిక్ విక్రయాల దుకాణాల్లో ప్రజారోగ్యశాఖ సిబ్బంది తనిఖీలు నిర్వహించి 12వందల కేజీ ప్లాస్టిక్‌సంచులను స్వాధీనం చేసుకున్నారు. నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి ఆధ్వర్యాన పారిశుధ్య పర్యవేక్షకులు దాడులు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్‌ను విశాఖపట్నంలోని జిందాల్ గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ కు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని అన్నారు. బడ్డీ కొట్లు, టిఫిన్ దుకాణాలలో కూడా అరిటాకులు, విస్తరాకులు వినియోగించి టిఫిన్ల విక్రయాలు సాగించాలని తెలిపారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని కోడూరు పంచాయతీ పరిధిలోని గొల్లలపేట గ్రామానికి చెందిన రాపాక గౌరమ్మ (55) ఆత్మహత్య చేసుకుంది. ఈ నెల 14న ఆమె కళ్లంలో పురుగుల మందు తాగింది. స్థానికులు వెంటనే ఆమెను బాడంగి సిహెచ్‌సికి, అక్కడి నుంచి విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం తెల్లవారు జామును ఆమె మరణించింది. ఆమె భర్త కొన్నేళ్ల క్రితం మరణించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.

విజయ సాధనకు 3 అంశాలు అవసరం

జిల్లా జడ్జి సాయి కళ్యాణ్ చక్రవర్తి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జీవితంలో విజయం సాధించాలంటే దృఢసంకల్పం, అంకితభావం, క్రమశిక్షణ వంటి మూడు అంశాలు అవసరమని జిల్లా జడ్జి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. జీవితంలో విజయం సాధించడానికి ఈ మూడు అంశాలు మనలో ఉన్నప్పటికీ విజయం సాధించడంలో ఎన్నో అవరోధాలు,ఆటంకాలు ఎదురవుతుంటాయని వాటిని ధైర్యంతో ఎదిరించి నిలిచేవాడే జీవితంలో పూర్తిస్థాయిలో విజయం సాధిస్తాడని జిల్లా తెలిపారు. జన విజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆనందగజపతి ఆడిటోరియంలో 'సామాజిక అవగాహన-జీవన నైపుణ్యాలు' అనే అంశంపై విద్యార్థులకు ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా జడ్జి మాట్లాడుతూ విజయం అంటే ఉద్యోగం సాధించడమే కాదని, జీవితంలో విజయం అనేది ఏ రూపంలో అయినా సాధించవచ్చని తెలిపారు. లక్ష్యసాధనలో ఓర్పు, సహనంతో పాటు మనం కచ్చితంగా సాధించగలమని మనపై మనకు నమ్మకం ఉండాలని అన్నారు. ఇవన్నీ కలిగిన వ్యక్తి తప్పకుండా జీవితంలో విజయం సాధించక తప్పరని అన్నారు. జిల్లా అదనపు జడ్జి కె.నాగమణి మాట్లాడుతూ పిల్లలకు ముందుగా తప్పు, ఒప్పులు నేర్పించేది తల్లిదండ్రులని, పిల్లలు చిన్న వయసులో తెలియక తప్పు చేస్తే అది తప్పు అని ముందుగా మందలించే వారు తల్లిదండ్రులేనని పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పదమే లక్ష్యంగా ఆవిర్భవించిన జెవివి ప్రజల్లో అందవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడంతో పాటు విద్యార్థులలో నైతిక విలువలు,సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించే దిశగా కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు జీవితంలో మంచి సమాజం వైపు అడుగులు వేయాలని సూచించారు. జెవివి రాష్ట్ర నాయకులు పి.రమేష్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.వి.ఆర్ కృష్ణాజి, జెవివి జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకట్రావు, రాష్ట్ర సమతా విభాగం అధ్యక్షురాలు సుజాత, సెంచూరియన్ యూనివర్సిటీ ఎఒ ఎన్‌వియన్ సూర్యనారాయణ, డిఎస్‌పి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని పొదుపుగా వాడుకోండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తాగునీటిని పొదుపుగా వాడుకొని అవసరాలు తీరిన తర్వాత ఆన్ ఆఫ్ స్విచ్ లను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. శనివారం గాజులరేగ, కెఎల్ పురం, పద్మావతి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించిన ఆయన కొత్తగా వేసిన పైప్ లైన్లు పరిస్థితిని గమనించారు. టిఫిన్ దుకాణాలు, చిరు వ్యాపారుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ వాడకం పట్ల కలిగే అనర్థాలను తెలిపారు. రహదారుల పై చెత్తాచెదారాలు వేయరాదని తెలిపారు. ఎంతో వ్యయ ప్రయాసలతో మంచినీటి పంపిణీ జరుగుతోందని, అలాంటి నీటిని ప్రతి ఒక్కరు జాగ్రత్తగా వినియోగించుకోవాలని చెప్పారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు జాబితాను శనివారం తహశీల్దార్ పి. సుదర్శన రావు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటర్ల నమోదుకు అందిన దరఖాస్తుల మేరకు తయారు చేసిన ఓటర్ల జాబితాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాబితాలో నమోదైన పేర్లపై ఎలాంటి అభ్యంతరాలు, దరఖాస్తులు డిసెంబర్ 9వ తేదీలోగాదరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం డిటి వివిఆర్ జగన్నాధ రావు, హెచ్‌డిటి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటు నమోదు పరిశీలన

ప్రత్యేక ఓటు నమోదును తహశీల్దార్ పి.సుదర్శన రావు శనివారం మొయిద, జరజాపుపేట, మొయిద జంక్షన్ పిఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల, పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు నమోదు చేసుకోవాలని పిలునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిటి వివిఆర్ జగన్నాధరావు పాల్గొన్నారు.

ప్రతీ వస్తువుకూ బిల్లు తప్పనిసరి

ప్రజాశక్తి-బొబ్బిలి

కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని వినియోగదారుల కోర్టు జడ్జి ఆర్.వెంకట నాగ సుందర్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఐటిఐలో శనివారం వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు మోసపోకుండా ఉండాలంటే షాపుల్లో కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లు తీసుకోవాలని కోరారు. నాణ్యమైన వస్తువులు ఇవ్వకపోతే వినియోగదారుల కోర్టును ఆశ్రయించి న్యాయం పొందవచ్చునని చెప్పారు. నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్స్, ఎరువులు, క్రిమిసంహారక మందులలో నాణ్యత లోపిస్తే ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం అధ్యక్షులు సత్యం, ఐటిఐ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న స్కీమ్‌వర్కర్లు, కార్మికులు

కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, గౌతమ్ ఆదాని కుంభకోణంపై జెపిసి విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం సిఐటియు ఆధ్వర్యాన స్కీం వర్కర్లు, కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షులు ఎ. జగన్ మోహన్ రావు, జిల్లా కమిటీ సభ్యులు కె.గురుమూర్తి, అంగన్వాడీ యూనియన్ నాయకులు సుశీల మాట్లాడారు. నిత్యవసర సరుకుల ధరలు మండిపోతున్నా కార్మికుల వేతనాలు పెరగటం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గత 15 ఏళ్లగా కనీస వేతనాల చట్ట సవరణ జరగలేదని, ఈ వేతనాలతో ఎలా బతకాలని ప్రశ్నించారు. ఈ డిమాండ్ల సాధనకు ఈనెల 26న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్ కూర్మనాధ్‌కు వినతినిచ్చారు.

పిఎం స్వానిధిపై అవగాహన

నెల్లిమర్ల : నగర పంచాయతీ పరిధిలోని జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం మెప్మా ఆధ్వర్యంలో పిఎం స్వానిధి - స్వభిమానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కె. అప్పలరాజు మాట్లాడుతూ మహిళలకు బ్యాంకు ద్వారా అతి తక్కువ వడ్డీతో వ్యాపార రుణాలు అందించి డిజిటల్ లావాదేవీలు, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ఒక దేశం ఒక రేషన్ కార్డు, జనని సురక్ష యోజన, ప్రధాన మంత్రి జన్-ధన్ యోజన తదితర పథకాలపై కార్మికులకు అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో సిఎంఎం డి.గోవింద రావు, సిఒ, ఐసిడిఎస్ సూపర్ వైజర్ త్రినాధమ్మ, విఆర్ఒ కె.వెంకటలక్ష్మి, వార్డు మహిళా కార్యదర్శి ఓ.దివ్య వాణి, మెప్మా ఆర్‌పిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటిఐలో అప్రెంటిస్ మేళా

రాజాం : పట్టణంలోని శ్రీకాకుళం రోడ్డు ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈ నెల 25న అప్రెంటీషిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ బి. భాస్కరరావు శనివారం ప్రకటనలో తెలిపారు. ఐటిఐ పాస్ అయిన ఫిట్టర్, ఎలక్ట్రిషన్, ఇనిస్ట్ మెంటేషన్, వెల్డర్ ట్రేడ్స్ అభ్యర్థులకు ఈ అప్రాంటేషన్ షిప్ మేళ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంకిలి షుగర్ ఫ్యాక్టరీ కంపెనీ సోమవారం ఈ మేళా నిర్వహిస్తోందన్నారు. ఐటిఐ పాసై 28 ఏళ్లలోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జెడ్‌పిటిసి సభ్యునికి 104 సిబ్బంది వినతి

ప్రజాశక్తి- వేపాడ

తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతూ 104 సిబ్బంది జెడ్‌పిటిసి ఎస్.అప్పలనాయుడుకు శనివారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వానికి వినతులు సమర్పించినా ఏ ఒక్క సమస్యా పరిష్కారం కావడం లేదని వారు వాపోయారు. దీంతో కుటుంబాన్ని పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో 104 సిబ్బంది కె.సతీష్, కె.మోహన్ పాల్గొన్నారు.



వినతినిస్తున్న 104 సిబ్బంది